యాకుత్‌పురా, కార్వాన్ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. బస్తీలు, కాలనీల్లో ఆత్మీయ సమావేశాలను సైతం నిర్వహిస్తున్నారు. మీకే ఎందుకు ఓటు వేయాలని 'సాక్షి' వారిని ప్రశ్నించగా ప్రజా సేవ, సమస్యల పరిష్కారాలు, అభివృద్ధి, తమ పార్టీ అమలుచేయబోయే సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని స్పష్టం చేస్తున్నారు.

– యాకుత్‌పురా/గోల్కొండ

నాకే ఓటు ఎందుకు వేయాలంటే..

నియోజకవర్గ సమస్యలు పరిష్కరిస్తా..



మా పార్టీని గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారు. ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబరాక్, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, రైతుబంధు పథకాలతో పాటు అనేక పథకాలు అమలుపరుస్తుంది. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలే నన్ను ఎన్నికల్లో గెలిపిస్తాయి. ప్రచారంలో వెలుగులోకి వచ్చిన ప్రధాన సమస్యలు, అన్ని ప్రాంతాలతో పాటు అభివృద్ధికి నోచ్చుకోని గౌలిపురా డివిజన్‌లో రూ.200 కోట్లతో పనులు చేపడుతాం.

– సామ సుందర్ రెడ్డి, బీఆర్ఎస్

మోదీ సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి..



కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ అందిస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో చేసిన అభివృద్ధి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలు పక్కదారి పట్టిస్తున్నారు. కరోనా కష్టకాలంలో దేశంలోని అన్ని వర్గాల ప్రజలను అందుకున్నాం. కేంద్రం చేస్తున్న అభివృద్ధిపై మొగ్గు చూపుతున్న ప్రజలు డబుల్ ఇంజన్ సర్కార్‌ను తీసుకువచ్చేందు సిద్ధమయ్యారు. యాకుత్‌పురా రైల్వే స్టేషన్ ఆధునీకరణకు ప్రత్యేక చర్యలు, కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఆస్పత్రి ఏర్పాటు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం. ఈ ఎన్నికలో అన్ని వర్గాల ప్రజలు ఆశీర్వదంతో విజయం సాధిస్తా.

– వీరేందర్‌బాబు యాదవ్, బీజేపీ

అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాం..



పాతబస్తీ అభివృద్ధికి మజ్లిస్ పార్టీ అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించింది. యాకుత్‌పురాలోని పురాతన డ్రైనేజ్ వ్యవస్థను తొలగించి నూతన పైప్ లైన్ నిర్మాణ పనులు చేశాం. వరద నీటి సమస్యల పరిష్కారానికి మౌలా కా చీల్లా, యాకుత్‌పురా రైల్వే స్టేషన్, ధోబీఘట్, మదీనానగర్, తలాబ్‌కట్టా, నాగాబౌళి ప్రాంతాలో నాలాలకు పైకప్పు ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నాం. ఎలాంటి హామీలు ఇవ్వకుండా ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న మజ్లిస్ పార్టీని భారీ మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారు.

– జాఫర్ హుస్సేన్ మేరాజ్, మజ్లిస్

ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తాం..



ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అందించిన ఘనత, ఉమ్మడి రాష్ట్రంలో మా ప్రభుత్వం పేద ప్రజలకు అందంచిన సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులతో పాటు ప్రజలు నన్ను గెలిపిస్తే సమస్యల పరిష్కారాన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటా. తెలంగాణ ఉద్యమన్ని ఏ ప్రభుత్వం పట్టించుకోకపోయినా సోనియా గాంధీ నాయకత్వంలోని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రాన్ని అందించింది. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకెళ్తాం. మహాలక్ష్మి, రైతు భరోసా, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, యువ వికాసం, చేయూత పథకాలను అర్హులైన ప్రజలకు అందిస్తాం.

– రావిరాజ్, కాంగ్రెస్

ప్రజలకు అందుబాటులో ఉంటా..



నిత్యం అన్ని వర్గాల ప్రజల సమస్యలు, సంక్షేమం కోసం పాటుపడిన మా తండ్రి దివంగత మాజీ ఎమ్మెల్యే మహ్మద్ అమానుల్లా ఖాన్ ఆశయ సాధనకు ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారిస్తున్నాం. గతంలో కార్పొరేటర్‌గా ఉన్నప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి స్థానిక సమస్యలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించా. ఒక్కసారి అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తా. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే మా పార్టీని అన్ని వర్గాల ప్రజలు గెలిపిస్తారు.

– మహ్మద్ అంజదుల్లాఖాన్, ఎంబీటీ

అందరికి అందుబాటులో ఉంటున్నా..



పదేళ్లుగా కార్వాన్‌లో అందరికీ అందుబాటులో ఉంటున్నా. ఎంపీ అసదుద్దీన్ చొరవతో కార్వాన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దా. బస్తీ దవాఖానాలతో పాటు గోల్కొండ ఏరియా ఆస్పత్రిని అభివృద్ధి చేశా. ఇబ్రహీంబాగ్‌లో ప్రభుత్వ మైనారీ విద్యా సంస్థ మంజూరైంది. కార్వాన్‌లో రూ.282 కోట్లతో అత్యాధునిక డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మూసీ పరీవాహక ప్రాంతం, శాతం చెరువును అభివృద్ధి చేశా. అధునాతన బాక్స్ టైప్ డ్రైనేజీలు నిర్మించి ఎన్నో డివిజన్‌లలో వరద ముంపును శాశ్వతంగా నివారించాను. కార్వాన్‌ను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మజ్లిస్ పార్టీకి ఓటు వేయాలి.

– కౌసర్ మోహియుద్దీన్, ఎంఐఎం

నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటా..



కార్వాన్ నియోజకవర్గంలో నేటికి ఎన్నో ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రతి ఒక్క బస్తీకి అభివృద్ధి కోసం నిధులను కేటాయిస్తా. ఫుట్‌పాత్ వ్యాపారులు, తోపుడు బండ్ల వారికి గుండాల నుంచి రక్షణ కల్పిస్తాం. పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోలేకపోతున్నారు. అధికారంలో ఉన్న నాయకులే మా మద్దతు దారులకు సంక్షేమ పథకాలను పంచిపెడుతున్నారు. రోడ్ల అభివృద్ధితో పాటు అధునాతన డ్రైనేజీ నిర్మాణానికి కృషి చేస్తా. యువతకు ఉపాధి కల్పన కోసం కేంద్ర ప్రభుత్వ నిధుల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేలా కృషి చేస్తా. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు వారికి సరైన సలహాలు సూచనలు ఇస్తా.

– అమర్‌సింగ్, బీజేపీ

సంక్షేమ పథకాల ఫలాలతో పేదలకు లబ్ధి..



బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తా. కార్వాన్ నియోజకవర్గంలో నిరుద్యోగుల కోసం ప్రభుత్వ కోచింగ్ సెంటర్లు ఏర్పాటుకు కృషి చేస్తా. బీసీ, ఎస్సీల విద్యార్థుల కోసం యూపీఎస్ఈ కోచింగ్ సెంటర్లు కూడా ఏర్పాటు చేస్తా. జియాగూడ కమేళా ఆధునీకరణకు కృషి చేస్తా. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి కార్వాన్‌లో ఉంటున్న వారికి అండగా ఉంటూ వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తా. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి నన్ను గెలిపించాలి.

– మిత్ర కృష్ణ, బీఆర్ఎస్

కబ్జా చెర నుంచి విడిపిస్తా..



కార్వాన్‌లో కబ్జా అయిన ప్రభుత్వ భూములు, వక్ఫ్ బోర్డు భూములను కబ్జా చెర నుంచి విడిపిస్తా. చెరువులు, నాలాల పరిరక్షణకు నావంతు కృషి చేస్తా. చారిత్రక కటోరా హౌజ్, శాతం చెరువు, టోలి మసీదు పరిరక్షణ, సుందరీకరణ కోసం కృషి చేస్తా. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేస్తా. స్వచ్ఛమైన పాలన అందించడం కాంగ్రెస్‌కే సాధ్యం. నిరుద్యోగ యువతకు అండగా ఉంటూ వారి ఉపాధి కల్పనకు మార్గదర్శనం చేస్తా. కార్వాన్ నియోజకవర్గంలో బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తా.

– ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ ఆజీరి, కాంగ్రెస్

జంగ్ 2023 తెలంగాణ

ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



మహంకాళేశ్వర అమ్మవారు



త్రయంబకేశ్వర శివాలయంలో..

చార్మినార్: మీరాలం మండి మహంకాళేశ్వర ఆలయంలో సోమవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం మహాభిషేకం, అలంకారం, శ్రీచక్ర అర్చన, స్వామి వారికి రుద్రాభిషేకం, ఆంజనేయ స్వామికి అభిషేకం, ఆకు పూజ, మంగళహారతిలతో పాటు సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామివ్రతం పూజల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు.

గుడిమల్కాపూర్‌లో..

అబిడ్స్: గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో కార్తీకపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజాము నుంచే భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు.

కాంగ్రెస్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు



మాట్లాడుతున్న మాజీ మంత్రి మారప్ప

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ పార్టీకి ఎమ్మార్పీఎస్ మద్దతు ఇస్తుందని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్.జె.ప్రకాష్ మాదిగ, మాజీ మంత్రి కోరేటి మారప్ప తెలిపారు. సోమవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ మాదిగలను దారుణంగా మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సైతం దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తామని నమ్మబలికి మాదిగలను రాజకీయంగా అణచివేశారన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ కేఎస్.బాబు వర్గం 2021లో వర్గీకరణపై సుప్రీంకోర్టులో కేసు వేసిందన్నారు. జనవరి 24న సుప్రీం కోర్టులో కేసు విచారణలోకి రానుందన్నారు. ఎల్లేష్ మాదిగ, అమరేందర్ మాదిగ, సురేష్ కుమార్ మాదిగ, బల్‌రామ్, రామస్వామి, చిలక నరేందర్ పాల్గొన్నారు.

రాజాసింగ్‌కు ఓటమి తప్పదు



ప్రచారం చేస్తున్న దామోదర్‌గుప్తా, నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: గోషామహల్‌ను అభివృద్ధి చేయకుండా అనాథగా మార్చిన ఎమ్మెల్యే రాజాసింగ్‌కు ఓటమి తప్పదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పేర్కొన్నారు. గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌తో కలిసి మంగళ్‌హాట్, ధూల్‌పేట్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం దామోదర్‌గుప్తా మాట్లాడుతూ..పదేళ్లుగా మతం పేరుతో ఓట్లు దండుకున్న రాజాసింగ్ గోషామహల్‌ను గాలికి వదిలారన్నారు. నందకిశోర్ వ్యాస్ మాట్లాడుతూ..25 ఏళ్లుగా నియోజకవర్గంలో వివిధ రకాల సేవలు చేసిన తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానన్నారు. పరమేశ్వరీ సింగ్, ఆనంద్ సింగ్, నవనీత తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో సున్నిత పోలింగ్ స్టేషన్ల వద్ద భారీ బందోబస్తు



ఏసీపీ వెంకట్‌రెడ్డి

అబిడ్స్: గోషామహల్‌లో 30న జరిగే ఎన్నికలకు సున్నితమైన ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు గోషామహల్ నోడల్ అధికారి ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి వివరించారు. సోమవారం నియోజకవర్గంలోని సున్నితమైన పోలింగ్‌స్టేషన్లను, బూత్‌లను సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 235 పోలింగ్‌స్టేషన్లకు గాను 19 మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసి ముమ్మర పెట్రోలింగ్ చేస్తున్నామన్నారు. 120 మంది రౌడీషీటర్లను బౌండోవర్ చేసిన ట్లు ఏసీపీ వివరించారు.

రాజాసింగ్, నందకిశోర్ వ్యాస్‌లపై కేసులు..

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన సందర్భంలో మొత్తం 69 కేసులు నమోదు చేశామని ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ కేసుల్లో ప్రధాన పార్టీలు అయిన బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్, బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌లపై రెండు కేసులు నమోదు చేశామన్నారు. ప్రతిరోజూ ముమ్మర పెట్రోలింగ్ చేపడుతూ భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మూడోసారి అధికారంలోకి బీఆర్ఎస్



నాంపల్లి: బీఆర్ఎస్ అభ్యర్థి సీహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్ సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ..అత్యధిక స్థానాలతో బీఆర్ఎస్ మూడో సారి అధికారంలోకి రానుందని తెలిపారు. అధికారంలోకి రాగానే నాంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రదీప్‌కుమార్, మెట్టు వాల్మీకి, దయానంద్ పాల్గొన్నారు.

చార్మినార్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయం



చార్మినార్: చార్మినార్‌లో బీఆర్ఎస్ పార్టీ విజయం ఖాయమని చార్మినార్ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఆయన నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలు తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గోషామహల్‌లో కాంగ్రెస్‌దే విజయం



అబిడ్స్: గోషామహల్‌లో కాంగ్రెస్‌దే విజయమని, అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌నే ఆదరిస్తున్నారని కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు పేర్కొన్నారు. గంగాబౌలి, సత్రాజీన గర్, అల్లబండ ప్రాంతాల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలకు అసత్య మాటలు చెబుతూ మోసం, దగా చేస్తున్నాయన్నారు.

బాలుడిపై కుక్క దాడి

బహదూర్‌పురా: బహదూర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని నంది ముసలయిగూడాలో ఆదివారం సాయంత్రం రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తున్న బాలుడు జగన్ మోహన్ రెడ్డి(3)పై కుక్క దాడి చేసింది. గమనించిన స్థానికులు వెంటనే కుక్కను అక్కడ నుంచి తరిమేసి, బాలుడిని ఆస్పత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాలుడి తండ్రి కార్మికుడిగా పని చేస్తుంటాడు. బాలుడికి తల్లి లేదు. బాలుడు ప్రస్తుతం నిలోఫర్ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'మజ్లిస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు'



ప్రచారంలో కౌసర్, ఎమ్మెల్యే పాషాఖాద్రీ, ఔరంగాబాద్ ఎంపీ

గోల్కొండ: మజ్లిస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ఆ పార్టీ ఔరంగాబాద్ ఎంపీ ఇంతియాజ్ జలీల్, చార్మినార్ ఎమ్మెల్యే అహ్మద్ పాషాఖాద్రీ అన్నారు. మజ్లిస్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు కార్వాన్ మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్‌తో కలిసి గోల్కొండ, నానల్‌నగర్ డివిజన్లలో సోమవారం ప్రచారాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. మజ్లిస్‌ను ఓడించడానికి ప్రధాని మోదీ తన క్యాబినేట్ మంత్రులతో తెలంగాణలో, ముఖ్యంగా నగరంలో పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారన్నారు. తెలంగాణ ప్రజలు ఉద్వేగపూరిత ప్రసంగాలను నమ్మరని తెలంగాణ ప్రజలు శాంతిని కోరుకుంటారని ఆయన అన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు బద్రుద్దీన్, అబీబ్‌చౌస్ ఉన్నారు.

వైభవంగా డుప్కి పున్నమి జాతర



నూతన రథంపై స్వామి వారి ఊరేగింపులో రాహుల్‌దాస్ బాబా

లంగర్‌హౌస్: డుప్కి పున్నమి జాతరం వైభవంగా ప్రారంభమయ్యింది. లంగర్ హౌస్ త్రివేణి సంగం ఒడ్డున వెలసిన మత ఆలయం జానకీ సమేత వీరవెంకట విజయరాఘవ స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ముక్తి స్నానాల జాతర సోమవారం ప్రారంభించారు. పీఠాధిపతి రాహుల్‌దాస్ బాబా ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామి వారికి నదీ స్నానం చేయించి, అనంతరం స్వామి వారికి రథోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు నదీ స్నానాలు ఆచరించి, కార్తీక దీపారాధన చేసి, వనభోజనాలు చేస్తు కుటంబాల సమేతంగా సరదాగా ఆడిపాడారు.

'సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి'

గౌలిపురా: సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి అన్నారు. సోమవారం గౌలిపురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. కందికల్‌గేట్ ప్రారంభమైన ఈ బైక్ ర్యాలీ ఛత్రినాక చౌరస్తా, లాల్‌దర్వాజా మహంకాళి దేవాలయం, బాలాగంజ్, గౌలిపురా మార్కెట్, మిత్రా క్లబ్ తదితర ప్రాంతాల్లో ర్యాలీ కొనసాగింది. సామ స్వప్న సుందర్ రెడ్డి, సీఎం ప్రవీణ్ రాజు, బొడ్డు సాయిబాబా పాల్గొన్నారు.



ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



గౌలిపురా: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ యాకుత్‌పురా అభ్యర్థి కె.రవిరాజ్ అన్నారు. సోమవారం ఆయన గౌలిపురా అయ్యప్ప స్వామి ఆలయంలో ఎన్నికల పరిశీలకులు ప్రమోద్ బాలన్ కలిసి కరపత్రానికి పూజలు నిర్వహించి బాండ్ రాశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఈ ఆరు గ్యారంటీ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు.

గ్యారంటీలు అమలు చేస్తామని అఫిడవిట్‌పై సంతకం



బహదూర్‌పురా: ఎన్నికల్లో గెలిచిన తర్వాత ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ దేవుడి ఎదుట ప్రమాణం చేశారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా దూద్‌బౌలిలోని ప్రాచీన శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం అఫిడవిట్‌పైన ఆయన సంతకం చేశారు. అనంతరం మాట్లాడుతూ..నియోజకవర్గం అభివృద్ధి కోసమే పూర్తిగా అంకితం అవుతానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటాయనన్నారు.

మజ్లిస్ పార్టీ పతనం ఖాయం



బీజేపీ నాయకులతో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర వాటర్ బోర్డు చైర్మన్ శ్రీదర్శన్

గోల్కొండ: ఈ అసెంబ్లీ ఎన్నికలతో మజ్లిస్ పార్టీ పతనం ఖాయమని బీజేపీ గోల్కొండ జిల్లా నియోజకవర్గాల పర్యవేక్షకులు, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర వాటర్ బోర్డు చైర్మన్ శ్రీదర్శన్ అన్నారు. సోమవారం ఆయన గుడిమల్కాపూర్‌లోని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, ఇతర బీజేపీ నాయకులను కలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. బీజేపీ గోల్కొండ జిల్లాలోని గోషామహల్, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలను అత్యధిక మెజార్టీతో బీజేపీ గెలవబోతుందని అన్నారు. బాలాప్రసాద్ తివారీ, మాజీ ఉదయ్‌కుమార్, కట్టా నర్సింగ్‌రావు, మురళీకృష్ణగౌడ్, సుధాకర్‌యాదవ్, ప్రభుపూజారి తదితరులున్నారు.

వర్గీకరణ సాధనకు బీజేపీని గెలిపించుకుందాం



లంగర్‌హౌస్: ప్రధాని మోదీ ఇచ్చిన మాట తప్పదని బీజేపీని గెలిపించి ఎస్సీ వర్గీకరణ సాధించుకుందామని కార్వాన్ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్ అన్నారు. హరిదాస్‌పుర, లక్ష్మీనగర్ తదితర బస్తీల్లో ఆయన పాదయాత్ర చేసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనకు తోడుగా ప్రచారంలో పాల్గొని బీజేపీకి మద్దతు తెలిపారు. ఇందులో భాగంగా అమర్‌సింగ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు దశాబ్దాలుగా పోరాడుతున్నా ఇక్కడి ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని వర్గీకరణను తాము చేస్తామని హామీ ఇచ్చారన్నారు.

మొగల్‌పురాలో బీఆర్ఎస్ ప్రచారం



చార్మినార్: చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని వ్యతిరేకిస్తూ ఆయన నుంచి వేరుపడిన నియోజకవర్గంలో మరో వర్గం సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ జెండా గుర్తుకు ఓటు వేయాలని మొగల్‌పురా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు పుస్తే శ్రీకాంత్, యశ్వంత్ కుమార్, మధు యాదవ్, పుప్పాల రాధాక్రిష్ణ, గోపీయాదవ్, మహ్మద్ అమీర్, రవీశ్వర్, పెండ్యాల లక్ష్మణ్‌రావు, గోపీగౌడ్ మాట్లాడుతూ.. చార్మినార్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేవలం ఒక వర్గం వారితోనే సఖ్యతగా ఉన్నారని.. సీనియర్లను దూరం చేసి నియంత లాగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి



చార్మినార్: మజ్లిస్ పార్టీకి ఓటు వేసి గతంలో కన్నా భారీ మెజార్టీతో పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫికర్ అలీని గెలిపించాలని మాజీ కార్పొరేటర్ మహ్మద్ గౌస్ అన్నారు. ఘాన్సీబజార్ డివిజన్‌లో బెంగాలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మజ్లిస్ పార్టీకి చార్మినార్ కంచుకోట లాంటిదని ఈ ఎన్నికల్లో ఆయన గెలుపు తథ్యమని మెజార్టీ కోసం మాత్రమే ప్రయత్నిస్తున్నామన్నారు. ఘాన్సీబజార్ డివిజన్ మజ్లిస్ పార్టీ ఇన్‌చార్జి సాహిల్ అక్బర్ పాల్గొన్నారు.

మిత్ర కృష్ణకు మహేర్ సంఘం మద్దతు



జియాగూడ: జియాగూడలోని మహేర్ సంఘానికి చెందిన సుమారు 50 కుటుంబాల సభ్యులు కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్ర కృష్ణకు మద్దతు ప్రకటించారు. సోమవారం బీఆర్ఎస్ కార్వాన్ డివిజన్ అధ్యక్షుడు పట్లూరి రఘు ఆధ్వర్యంలో మహేర్ సంఘం సభ్యులు మిత్ర కృష్ణను ఘనంగా సన్మానించారు. మిత్ర కృష్ణ మాట్లాడుతూ..మహేర్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని, ఓట్లు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. సునీల్ కామ్లే, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని చిత్తుగా ఓడించండి



అబిడ్స్: మతం పేరుతో ఓట్లు దండుకునే బీజేపీని చిత్తుగా ఓడించాలని బీఆర్ఎస్ కార్మిక విభాగం ఈఎస్ఐ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చలపతిరావు పేర్కొన్నారు. మురళీధర్‌బాగ్‌లో బీఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, సాయికుమార్‌తో కలిసి ఆయన ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడుతూ..బీజేపీ కేవలం ఎన్నికలప్పుడే ప్రజల ముందుకు వస్తుందన్నారు. ప్రజలు బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్ బిలాల్‌ను గెలిపించాలన్నారు. ధన్‌రాజ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేసేందుకు అవకాశమివ్వండి



చాంద్రాయణగుట్ట: నియోజకవర్గంలో సేవ చేసేందుకు ఒక్కసారి అవకాశం కల్పించాలని యుగ తులసి పార్టీ అభ్యర్థి ఆడాల కరుణ కోరారు. ఉప్పుగూడలో ఆమె ఇంటింటికి తిరుగుతూ రోడ్డు రోలర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నన్ను గెలిపిస్తే మహిళలకు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల సమస్యలు పరిష్కరిస్తానన్నారు.

హైదరాబాద్ సీసీఎస్ డైరెక్టర్‌గా వేగి నాగమురళీకృష్ణ

నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వే కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ హైదరాబాద్ బ్రాంచ్ డైరెక్టర్‌గా వేగి నాగ మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంప్లాయిస్ సంఘ్ బలపరిచిన ప్యానెల్ ఎన్నిక కావడంతో హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో సోమవారం కార్మికులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలో విజయోత్సవ ర్యాలీని చేపట్టారు. వరుసగా ఐదోసారి సంఘ్ డైరెక్టర్ పదవిని కైవసం చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఎస్.వి.ఎస్.చౌదరి, రామరాజు, ప్రసాద్, సత్యకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

చాంద్రాయణగుట్ట: నియోజకవర్గం అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి బోయ నగేష్ అన్నారు. ఉప్పుగూడలో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ గెలుస్తుందన్న భయంతోనే రైతు బంద్‌కు బ్రేకులు పడేలా మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు చేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మహిళలందరికీ న్యాయం చేస్తామన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9010221230
9010463222
9553955684